సాక్షి సూర్యాపేట

గురువారం ◊ 9 ◊ అక్టోబర్ ◊ 2025



చేనేత రుణమాఫీ ఏమాయే!
చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి 13 నెలలు అవుతున్నా అమలుకు నోచుకోలేదు. - 8లో



ఐదుగురి అరెస్ట్
పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని చంపుతామని బెదిరించిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,00,409 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,00,409 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,333 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,022 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	600 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

10న వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్ పోటీలు

నల్లగొండ టూటౌన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరంలో భాగంగా ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14, 17 బాల, బాలికలకు ఈనెల 10వ తేదీన వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డి.విమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా పాఠశాలల్లో వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులను పంపించాలని కోరారు. ఈ సెలక్షన్ పోటీలు నల్లగొండ పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా భవనం పైఅంతస్తులో నిర్వహిస్తామని, 2009 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9703269840 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


మట్టపల్లిలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం నిత్యకల్యాణతంతును పూర్తి చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బ్రహ్మాచార్యులు , లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

సాగర్‌కు తగ్గిన వరద



ఆరు గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద తగ్గింది. దీంతో మంగళవారం తెరిచిన 22 క్రస్ట్‌గేట్లలో 18 గేట్లు మూసివేశారు. ఆరుగేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి సాగర్ జలాశయానికి 1,00,409 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా ఆరు రేడియల్ క్రస్ట్‌గేట్ల నుంచి 48,414 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,333 క్యూసెక్కులు.. మొత్తం 81,747 క్యూసెక్కులు దిగువ కృష్ణానదిలోకి వదులుతున్నారు.



పాలకవీడు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

యూరియా బారులు

పాలకవీడు: ఈ వానాకాలం సీజన్‌లో వరినాట్లు వేసి దాదాపు 90 రోజులు గడుస్తున్నా రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదు. యూరియా స్టాక్ వచ్చిందని సమాచారం అందడంతో బుధవారం పాలకవీడుమండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్దకు సుమారు 350 మంది వరకు రైతులు చేరుకున్నారు. సహకార కేంద్రంలో 444 బస్తాల యూరియా అందుబాటులో ఉంది. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేయగా మిగిలినవారు నిరాశతో వెనుదిరిగారు. వ్యవసాయ అధికారి కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ రైతుల ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకాల జిరాక్స్ తీసుకుని టోకెన్లు జారీచేస్తున్నామన్నారు. తేదీల వారీగా టోకెన్లు ఉన్న ఒక్కో రైతుకు రెండు కట్టల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మొదటి విడతకు సిద్ధం

నేడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్

- సూర్యాపేట రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో ఏర్పాట్లు
- ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్ కేంద్రాల వద్ద వంద మీటర్ల వరకే ర్యాలీలకు అనుమతి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు



ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో సిద్ధంగా ఉన్న ఎన్నికల సామగ్రి

భానుపురి (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఈమేరకు ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మొదటి విడతగా జిల్లాలోని సూర్యాపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోగల 11 మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. ఆ వెంటనే రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.

మొదటి విడత ఇలా..

మండలాలు	11
జెడ్పీటీసీ స్థానాలు	11
ఎంపీటీసీ స్థానాలు	112
ఆర్‌ఓలు	37
ఏఆర్‌ఓలు	37
రిజర్వ్ ఆర్‌ఓలు	11
రిజర్వ్ ఏఆర్‌ఓలు	11
పోలింగ్ కేంద్రాలు	616

రెండు విడతల్లో..

జిల్లాలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను రెవెన్యూ డివిజన్ల వారీగా నిర్వహించనున్నారు. మొదటి విడతలో సూర్యాపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని సూర్యాపేట, ఆత్మకూర్, పెన్‌పహాడ్, చివ్వెంల, నూతనకల్, మద్దిరాల, జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం, మోతె మండలాల్లో 11 జెడ్పీటీసీ, 112 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి గురువారం ఆయా మండలాల ఆర్‌ఓలు నోటిఫికేషన్ ఇచ్చి నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నారు. ఇక కోదాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చిలుకూరు, కోదాడ, మునగాల, నడిగూడెం, అనంతగిరి మండలాలు, హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం, గరిడేపల్లి, పాలకవీడు, నేరేడుచర్ల మండలాల్లోని 12 జెడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలకు ఈనెల 13వ తేదీన రెండోవిడత నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.

చకాచకా ఏర్పాట్లు..

నామినేషన్ల స్వీకరణకు రిటర్నింగ్ అధికారుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. తాజాగా పోలింగ్ కేంద్రాల్లో బాధ్యతలు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), ఇతర పోలింగ్ అధికారుల ఎంపికను పూర్తిచేశారు. త్వరలోనే వీరికి మండల స్థాయిలో రెండోవిడత శిక్షణ ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. తొలివిడత గురువారం నుంచే జెడ్పీటీసీ, ఎంపీటీసీల నామినేషన్లు స్వీకరించనుండగా.. ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు, నాలుగు మండలాలను ఒక క్లస్టర్ చొప్పున విభజించి ఆర్‌ఓలను నియమించారు. వీరి ఆధ్వర్యంలోనే నామినేషన్ స్వీకరణ నుంచి పరిశీలన ప్రక్రియ అంతా జరగనుంది. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. ఇక అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు గాను నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

11 మండలాల్లో..

జిల్లాలోని సూర్యాపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. గురువారం నోటిఫికేషన్ వెలువడడంతో పాటు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. 11వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. 12న నామినేషన్ల పరిశీలన, 15వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఇక పోలింగ్ 23న జరగనుండగా.. ఫలితాలు నవంబర్ 11న వెల్లడించనున్నారు.

తీర్పు ఎలా వస్తుందోనని..

ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. బుధవారం హైకోర్టులో వాదనలు జరగ్గా.. గురువారం నాటికి వాయిదా వేయడంతో కోర్టు తీర్పు ఎలా వస్తుందో ? రిజర్వేషన్ల ప్రక్రియ ఏమవుతుందోనని ఇటు ప్రజలు, అటు అధికారులు చర్చించుకుంటున్నారు.

నోటిఫికేషన్ జారీకి రెడీ

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీకి రెడీగా ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జెడ్పీసీఈఓ అప్పారావు, డీపీఓ యాదగిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్ లు, పోలీస్ సిబ్బంది, ఎంపీడీఓలు, ఆర్‌ఓలతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. సూర్యాపేట డివిజన్ పరిధిలోని 11 జెడ్పీటీసీ, 112 ఎంపీటీసీ స్థానాలకు చెందిన ఆర్‌ఓలు గురువారం ఉదయం 8 గంటలకే తమ కార్యాలయాలకు చేరుకోవాలన్నారు. ఆర్‌ఓ కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరం వరకు మార్కింగ్ చేయాలని,10 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి నోటీసు బోర్డు లో ప్రదర్శించాలని సూచించారు. నామినేషన్ వేసేటప్పుడు అభ్యర్థి తో కలిపి ముగ్గురికి మాత్రమే ఆర్‌ఓ చాంబర్‌లోకి అనుమతి ఉంటుందని, ఒక్క వాహనానికి అనుమతి ఉందని తెలిపారు. ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, అన్ని ఆర్‌ఓ కార్యాలయాల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేస్తామని, అంతర్‌రాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేస్తామన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జెడ్పీసీఈఓ వి.వి. అప్పారావు, డీపీఓ యాదగిరి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, డీఎల్‌పీఓ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

చివరిగింజ వరకు ధాన్యం సేకరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చివరి గింజ వరకు ధాన్యం సేకరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో వానాకాలం 2025-26 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీఓ, మెప్మా శాఖలకు చెందిన కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఐకేపీ ద్వారా 158, పీఏసీఎస్ 122, ఎఫ్‌పీఓ 15, మెప్మా 13 ఇలా మొత్తం 308 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతంలో ఉండకుండా ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి కేంద్రంలో వేయింగ్ మిషన్, విద్యుత్, తాగునీరు, ఫ్లెక్సీపై నిర్వాహకుల పేరు ఫోన్ నంబర్, టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్లు, డ్రయ్యర్లు, ట్యాబ్ లాంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. గతంలో మాదిరిగా తప్పులు దొర్లకుండా ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు గడ్డి, తాలు, దుమ్ము లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. మండలాల వారీగా షెడ్యూల్ తయారుచేసి ఎం ఎల్ ఎస్ పాయింట్ నుంచి కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీఎస్‌ఓ మోహన్ బాబు, డీఎం రాము, డీసీఓ పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, రవాణా అధికారి జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- ఎస్పీ నర్సింహ

సూర్యాపేటటౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ నరసింహ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్థానిక ఎస్‌ఐలతో పాటు డీఎస్పీలు, సీఐల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. 100 మీటర్ల పరిధి నిబంధన ఉంటుందని, బారికేడ్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నామినేషన్ సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దని కోరారు. అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. మద్యం అమ్మకాలపై నిఘా ఉంచామని, రహదారుల వెంట హోటళ్లు, డాబాల్లో మద్యం అమ్మవద్దని సూచించారు. డయల్ 100 కు, పోలీస్ కంట్రోల్ రూం 8712686057, సోషల్ బ్రాంచ్ కంట్రోల్ రూం నంబర్ 8712686026 కు సమాచారం ఇవ్వాలని కోరారు. గత ఎన్నికల్లో కేసుల్లో ఉన్న నెరస్తులను ముందస్తుగా బైండోవర్ చేయడం, సమస్యలు సృష్టించే ట్రబుల్ మాంగర్స్, రౌడీలు, కేడీలు, సస్పెక్ట్ లను ముందస్తు బైండోవర్ చేస్తామని తెలిపారు. సోషల్ మీడియా పై ప్రత్యేక నిఘా ఉంచామని, తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే విధంగా, అవమానపరిచే విధంగా రూమర్స్ సృష్టించడం లాంటివి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే సంబంధిత వ్యక్తులు, వాట్సప్ అడ్మిన్‌లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎడమ కాల్వ గండ్లకు మరమ్మతులు చేయిస్తాం



వేములూరు ప్రాజెక్టు ఎడమ కాల్వ గండి కొలతలు తీయిస్తున్న నీటిపారుదలశాఖ ఈఈ, డీఈఈ

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని యాతవాకిల్ల వద్ద గల వేములూరు ప్రాజెక్టు ఎడమ కాల్వకు పడిన గండ్లకు యుద్ధ ప్రాతి పదికన మరమ్మతులు చేయిస్తామని నీటి పారుదల శాఖ ఈఈ అశోక్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మఠంపల్లి మండలంలోని వరదాపురం, మంచ్యాతండా గ్రామాల వద్ద ఎడమ కాల్వకు గండ్లు పడటంతో సాగునీరంతా వృథాగా వెళ్లిపోతుండటంతో ఆయా గ్రామాల రైతులు, నాయకులు చేసిన ఫిర్యాదు చేశారు. దీంతో ఈఈతో పాటు అధికారులు ఆ గండ్లను పరిశీలించి కొలతలు తీయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పంటలకు సక్రమంగా సాగునీరందేలా చూస్తామన్నారు. ఈకార్యక్రమంలో డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈఈ ఫయాజ్, నాయకులు, రైతులు మాళోతు బాబునాయక్, నాగేశ్వరరావు, కిషన్‌నాయక్ , కోట్యా నాయక్, లష్కర్ కోటాలు తదితరులు ఉన్నారు.

నల్లగొండ ఉర్సుకు వేళాయే..

- మూడు రోజులపాటు ఉత్సవాలు
- నేడు గంధం ఊరేగింపు



ముస్తాబైన దర్గా ముఖద్వారం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని హజరత్ సయ్యద్ షా లతీఫ్ ఉల్లా ఖాద్రి దర్గా ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానుంది. కులమతాలకు అతీతంగా ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉర్సు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం స్థానిక మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపుతో ఉర్సు ప్రారంభమవుతుంది. 10న దీపాలంకరణ, 11న ఖవ్వాలితో ఉర్సు ముగుస్తుంది. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించాలి

- జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు

నూతనకల్ : చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని సకాలంలో గుర్తించి దాని నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు సూచించారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో పోషణ మాసంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కౌమారదశ బాలికల్లో పోషకాహార లోపాన్ని నివారిస్తే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే మాతాశిశు మరణాలను పూర్తిస్థాయిలో తగ్గించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీవాణి, అసిస్టెంట్ సీడీపీఓ సాయిగీత, మండల వైద్యాధికారి లిఖిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులత, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. ,

పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి

- డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్



జాజిరెడ్డిగూడెం పల్లెదవాఖానాలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

అర్వపల్లి: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం అర్వపల్లి పీహెచ్‌సీ, జాజిరెడ్డిగూడెం పల్లెదవాఖానాను ఆయన తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు టీకాలు వేయాలని, సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేశ్‌నాయక్, సీహెచ్‌ఓ ఎం.బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, డాక్టర్ ఉదయ్, నర్సింగ్ అధికారులు సునీత, మాధవి సిబ్బంది పాల్గొన్నారు.

క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ

- సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుతున్న వందల మంది బాధితులు
- ఈ ఏడాది తొమ్మిది నెలల్లోనే రూ.8.81కోట్లు కాజేసిన నేరగాళ్లు
- ఇప్పటి వరకు 614 సైబర్ క్రైం కేసులు నమోదు
- అనవసరమైన లింక్‌లు క్లిక్ చెయ్యొద్దంటున్న పోలీసులు



ఇటీవల కోదాడకు చెందిన రిటైర్డ్ డాక్టర్‌కు డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. మీ పేరుపై ఫేక్ సిమ్స్, ఆధార్ కార్డులు ఓపెన్ అయి మనీ లాండరింగ్ అయిందని భయపెట్టారు. మీకు ఇల్లీగల్ ట్రాన్‌జాక్షన్ అవుతున్నాయని, మేము చెప్పినట్టు చేస్తే సేఫ్‌లో ఉంటారని ఆ రిటైర్డ్ డాక్టర్‌ను భయపెట్టేవిధంగా మాట్లాడారు. మీరు కొంత అమౌంట్ డిపాజిట్ చేస్తే సేఫ్‌లో ఉంటారని చెప్పారు. దీంతో ఆందోళన చెందిన సదరు రిటైర్డ్ డాక్టర్ తనకున్న నాలుగు బ్యాంక్ అకౌంట్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లకు రూ.1.08లక్షలు డిపాజిట్ చేశారు. ఆ తర్వాత మోసపోయానని గ్రహించి జిల్లా సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఇలా సైబర్ కేటుగాళ్ల వలలో పడి చాలా మంది మోసపోతున్నారు.

కోదాడ సబ్ డివిజన్ పరిధిలో ఓ వ్యాపారవేత్తకు ఇటీవల వాట్సాప్‌కు ఫినాల్డో డాట్ ఇండస్ అనే కంపెనీ పేరుతో మెసేజ్ వచ్చింది. ఈ యాప్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పెడితే డబుల్ అమౌంట్ వస్తుందని చెప్పారు. దీంతో అతను మొదట రూ.10వేలు ఇన్వెస్ట్ చేస్తే రూ.15వేలు వచ్చాయి. ఆ తర్వాత రూ.30వేలు ఇన్వెస్ట్ చేస్తే దీనికి డబుల్ వచ్చింది. ఇలా డబుల్ అమౌంట్ వస్తుండటంతో ఒకేసారి రూ.కోటి ఇన్వెస్ట్ చేశాడు. దీంతో ఆ డబ్బులు తిరిగి రాక షాక్‌కు గురయ్యాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొంత అమౌంట్ సైతం హోల్డ్‌లో పెట్టినట్టు చెబుతున్నారు.

సూర్యాపేటటౌన్ : అనవసరమైన లింకులు క్లిక్ చేస్తే మీ అకౌంట్ ఖాళీ అయినట్టే. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి వందల మంది తమ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను పోగొట్టుకుంటున్నారు. ఆన్‌లైన్, టెక్నాలజీని వినియోగించుకొని సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. నిరక్షరాస్యులే కాకుండా విద్యావంతులు సైతం వీరి వలలో చిక్కి జేబులు గుల్లజేసుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, మ్యాట్రిమోని, డిజిటల్ అరెస్టు, ఫోన్లకు వచ్చే మెసేజ్‌ల లింకులు, ఈ మెయిల్‌తో హ్యాకర్లు చీటింగ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజూ ఐదారు కేసులు నమోదవుతూనే ఉన్నాయి.

తొమ్మిదినెలల్లో 614 కేసులు

సైబర్ నేరగాళ్లు వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలతో జిల్లాలో ఈ ఏడాది తొమ్మిది నెలల్లోనే రూ.8,81,97,429 డబ్బులు కాజేశారు. ఇందులో 1,24,54,885 రూపాయలను ఫ్రీజ్ చేశారు. బాధితులకు 95,37,155 రూపాయలు రిఫండ్ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 614 సైబర్ కేసులు నమోదయ్యాయి.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ మోసగాళ్ల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పండుగలకు స్పెషల్ ఆఫర్స్ అంటూ ఏమైనా బ్లూ లింక్స్ వచ్చినా, మెసేజ్ లు వచ్చినా వాటిని అనుసరించవద్దు. అపరిచితులు డబ్బులు అడిగితే స్పందించవద్దు. వాట్సాప్‌లో వచ్చే ఏపీకే ఫైల్స్, ఇతర బ్లూ లింక్స్ అనవసరంగా క్లిక్ చేయొద్దు. మీరు సైబర్ మోసానికి గురైనట్టు గ్రహిస్తే వెంటనే 1930కి కాల్ చేయాలి. అలాగే సైబర్ క్రైం వెబ్‌సైట్‌కు ఫిర్యాదు చేస్తే మీరు పోగొట్టుకున్న డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంటుంది.

– కె.నరసింహ, ఎస్పీ

పోలీసుల సూచనలు పాటించండి

- ఏ బ్యాంక్ ఉద్యోగి ఖాతాదారునికి ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడగరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని అపరిచితులు చెప్పితే నమ్మవద్దు, వారు సైబర్ మోసగాళ్లని గ్రహించాలి.
- మెస్సేజ్‌లు, బ్లూ లింక్‌లను అనుసరించి డబ్బులు పెట్టవద్దు.
- బహుమతులు వచ్చాయని, తక్కువ వడ్డీకి లోన్ అందుబాటులో ఉందని, తక్కువ రేటుకు వస్తువులు, వాహనాలు ఉన్నాయని, మంచి ఉద్యోగాలు ఉన్నాయని అని చెప్పి ప్రాసెసింగ్, రిజిస్ట్రేషన్‌కు ఫీజు కట్టాలి అని చెబితే నమ్మి డబ్బులు చెల్లించవద్దు.
- లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలి.
- కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్‌లో వెతకవద్దు. ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లను పొందాలి.
- అపరిచిత నంబర్ల నుంచి ఫేస్ బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించవద్దు.
- లాటరీ ఆఫర్లంటూ వచ్చే మెసేజ్‌ను నమ్మవద్దు.
- అన్ వెరిఫైడ్ యాప్స్, వెబ్ సైట్స్ అందించే ప్రకటనలను నమ్మవద్దు. వారిచ్చే మోసపూరిత ఆఫర్లకు స్పందించి మోసపోవద్దు.
- ఓఎల్ఎక్స్ లాంటి వాటిల్లో ఆర్మీ సోల్జర్లం, ఆఫీసర్లం అంటూ ఎవరైన సంప్రదిస్తే నమ్మి మోసపోవద్దు.
- బ్యాంక్ లో వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తాం అంటే ఎవరికీ ఆధార్, బ్యాంక్ ఖాతా, ఏటీఎం, ఓటీపీ నంబర్లు చెప్పవద్దు.



క్లుప్తంగా

కుమార్తెతో కలిసి మహిళ అదృశ్యం

మిర్యాలగూడ అర్బన్: ఏడాది వయస్సున్న కుమార్తెతో కలిసి మహిళ అదృశ్యమైంది. మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో లావూరి వెన్నెల తన భర్త వినోద్‌తో కలిసి నివాసముంటోంది. వీరికి ఏడాది వయస్సున్న పాప ఉంది. ఈ నెల 4న వినోద్ పని నిమిత్తం వేరే ఊరికెళ్లగా.. అదే రోజు ఉదయం 9గంటల సమయంలో వెన్నెల తన కుమార్తెతో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వినోద్ ఎంత వెతికినా వెన్నెల ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 95021 52452 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

సాగర్ ఎడమ కాలువలో వ్యక్తి గల్లంతు



బాబునాయిక్

మునగాల: అయ్యప్ప మాల ధరించిన వ్యక్తి సాగర్ ఎడమ కాలువలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో గల్లంతయ్యాడు. ఈ ఘటన మునగాల మండలం కృష్ణానగర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్ గ్రామానికి చెందిన బుక్యా బాబునాయిక్(42) బుధవారం అయ్యప్ప మాల స్వీకరించాడు. సాయంత్రం స్నానం చేసేందుకు గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువకు మరికొందరు అయ్యప్ప మాలధారులతో కలసి వెళ్లాడు. స్నానం చేసే క్రమంలో బాబునాయిక్ ప్రమాదవశాత్తు జారి ఎడమ కాలువలో మునిగిపోయాడు. అతడికి ఈత వచ్చినప్పటికీ వరద తాకిడికి కొట్టుకుపోయాడు. బాబునాయిక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. అయ్యప్ప మాలధారులు, బాబునాయిక్ కుటుంబ సభ్యులు నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఐదు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

మఠంపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ ఘటన మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రంలో నివాసముంటున్న ఆదూరి మల్రెడ్డి అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అతడి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. చోరీ జరిగిన విషయం బంధువుల ద్వారా తెలుసుకున్న మల్రెడ్డి బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. బాబు తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన వంటి పూజలు చేపట్టారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు భక్తులచే జరిపించారు.

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తామని 13 నెలల క్రితం ప్రకటించిన ప్రభుత్వం
- నాలుగు నెలల కిత్రం జీఓ జారీ
- నేటికీ అమలుకు నోచుకోని పథకం
- ఇబ్బందుల్లో చేనేత కార్మికులు



ఈ ఫొటోలోని వ్యక్తి పోచంపల్లికి చెందిన చేనేత కార్మికుడు గుండు ప్రవీణ్. రెండేళ్ల క్రితం స్థానిక కెనరా బ్యాంకు నుంచి రూ.2లక్షల రుణం తీసుకున్నాడు. నెలానెలా కిస్తీలు చెల్లిస్తూ వస్తుండగా.. చివరగా రూ.1.23లక్షలు బకాయి పడ్డాడు. రూ.లక్ష లోపు చేనేత రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో బంగారం అమ్మి పై రూ.23,500 బ్యాంకులో చెల్లించాడు. కానీ ఇప్పటివరకు మిగతా రూ.లక్ష, రుణమాఫీ కాలేదు. దీంతో మూడు నెలల వడ్డీ కింద అతని ఖాతా నుంచి రూ.3వేలు కట్ చేశారు.

భూదాన్‌పోచంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించి 13 నెలలవుతున్నా నేటికీ అమలుకు నోచుకోక వడ్డీ భారం పెరుగుతుందని నేతన్నలు వాపోతున్నారు.

రుణమాఫీకి జీఓ జారీ చేసినా..

రుణమాఫీ చేస్తామని గతేడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ(ఎస్ఐహెచ్‌టీ) ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విధివిధానాలు ఖరారు చేయడం, ఎన్నికల కోడ్ కారణాల వల్ల జాప్యం జరిగింది. ఏడు నెలల క్రితం అసలు, వడ్డీ కలుపుకుని రూ.లక్ష లోపు ఉన్న వ్యక్తిగత చేనేత రుణాలను మాఫీ చేస్తూ జీఓ నంబర్ 56ను జారీ చేసింది. 2025–26 బడ్జెట్ నుంచి రూ.33 కోట్లు మంజూరు చేస్తూ నాలుగు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్కుల కమిషనర్‌కు ఈ నిధులను విడుదల చేసి లబ్ధిదారులకు చెల్లించేందుకు అధికారాలు ఇచ్చారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను మాఫీ చేయనుంది. యాదాద్రి జిల్లాలో వివిధ బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 2,380 మంది చేనేత కార్మికులకు రూ.19.25 కోట్ల రుణమాఫీ జరుగనుంది. అలాగే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి 423 మంది చేనేత కార్మికులకు రూ.4కోట్ల రుణమాఫీ లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,803 మందికి రూ.23.25 కోట్ల మేర రుణమాఫీ కానుంది.

నేటికీ ఆమోదించని రాష్ట్ర కమిటీ

రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించకపోవడంతో రుణమాఫీ అమలులో తీవ్ర జాప్యం జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఆయా జిల్లాల పరిధిలో చేనేత కార్మికులు తీసుకున్న రుణాల వివరాలను చేనేత, జౌళి శాఖ ఏడీలు బ్యాంకుల వారీగా జాబితాను తయారు చేసి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలో సభ్యులుగా ఉన్న డీసీసీబీ సీఈఓ, చేనేత శాఖ ఆర్‌డీడీ, లీడ్‌బ్యాంకు మేనేజర్, నాబార్డు డీజీఎం, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా సహకార అధికారులు ఆమోదించారు. అనంతరం ఆగస్టులో రుణమాఫీ అర్హుల జాబితాను రాష్ట్ర స్థాయి కమిటీకి పంపించారు. కొన్ని జిల్లాల నుంచి జాబితాలు రాష్ట్రస్థాయి కమిటీకి అందని కారణంగా రుణమాఫీ అమలులో జాప్యం జరుగుతోందని తెలిసింది.

అప్పు చేసి చెల్లించి..

రూ.లక్ష పైన రుణాలు తీసుకున్న వారు ఆ పై మొత్తాన్ని జూలై నెలాఖరులోగా చెల్లిస్తే వారందరికీ రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు చెప్పడంతో చాలా మంది అప్పులు చేసి, బంగారం కుదవపెట్టి రుణాలు చెల్లించారు. రుణమాఫీ అమలు కాక కార్మికుల ఖాతాల్లోంచి మూడు నెలల వడ్డీ కట్ చేసుకున్నారు. మరోవైపు బయట తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.



రూ.75 వేలు బకాయి ఉంది



2015లో స్థానిక కెనరా బ్యాంకు నుంచి రూ.50 వేలు లోన్ తీసుకున్నాను. అసలు, వడ్డీ కలుపుకుని మొత్తం రూ.75వేలు బకాయి ఉంది. ఇంకా చేనేత రుణమాఫీ కాలేదు. వెంటనే నేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలి. – మిర్యాల వెంకటేశం, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

తక్షణమే రుణమాఫీ చేయాలి



ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి ఏడాది గడిచిపోయింది. తక్షణమే చేనేత రుణమాఫీ చేయాలి. చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా, చేనేతపై జీరో జీఎస్టీ తదితర సమస్యలపై చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పోచంపల్లిలో అఖిలపక్షాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. – కర్నాటి పురుషోత్తం, చేనేత జన సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు

ఆదేశాలు రాలేదు..



చేనేత కార్మికుల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న 2,380 మంది చేనేత కార్మికుల జాబితాను ఆగస్టులోనే రాష్ట్రస్థాయి కమిటీకి పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం. – శ్రీనివాసరావు, యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ

ఆరు గ్యారంటీల పేరిట మోసం చేశారు



కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు అందజేస్తున్న చిరుమర్తి లింగయ్య

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: ఆరు గ్యారంటీల పేరిట తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీలతో కూడిన బాకీ కార్డులను బుధవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ప్రజలకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ మర్చిపోయిన హామీలను గుర్తుచేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజల వద్దకు బాకీ కార్డులను తీసుకొచ్చిందన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, నాయకులు సోమయాదగిరి, గుర్రం గణేష్, రాచకొండ వెంకన్నగౌడ్, గోర్ల వీరయ్య, రావిరాల మల్లయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేషం, యానాల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాలియా ఎస్‌బీఐ శాఖలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నీచర్, కంప్యూటర్లు, ఏసీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధం



హాలియా ఎస్‌బీఐ శాఖలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హాలియా: హాలియా పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి బ్యాంకులో ఉన్న అలారం మోగింది. దీంతో వాచ్‌మెన్ గమనించి బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ఎస్ఐ సాయిప్రశాంత్ తమ సిబ్బందితో బ్యాంకు వద్దకు చేరుకొని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ ప్రమాదంలో బ్యాంకులోని కంప్యూటర్లు, ఏసీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫర్నీచర్ కాలిబూడిదయ్యాయి. బ్యాంకు మేనేజర్ మోహన్‌ని వివరణ కోరగా.. షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించామని, ఈ ఘటనపై ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యమైన డాక్యూమెంట్లకు ఏమీ కాలేదని, ఒక కంప్యూటర్, రెండు ఏసీలు, కొంత ఫర్నీచర్ మాత్రం కాలిపోయిందని తెలిపారు.

ప్రమాదంపై ఆరా..

బ్యాంకులో జరిగిన ప్రమాదానికి గల కారణాలు, నష్టం వివరాలు, బ్యాంకులో తాకట్టు పెట్టిన షూరిటీ పత్రాలు, బంగారం, నగదు తదితర వివరాలపై ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమాద వివరాలను తెలుసుకునేందుకు ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం అధికారులు రానున్నట్లు తెలిసింది. ఎస్ఐ సాయి ప్రశాంత్, అగ్నిమాపక అధికారులు బ్యాంకు అధికారులను అడిగి నష్టం వివరాలను తెలుసుకున్నారు.

సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



కరుణాకర్ (ఫైల్)

బొమ్మలరామారం: బొమ్మలరామారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కోమరాజు కరుణాకర్(27) అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో జరిగాయి. రాజస్తాన్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న కరుణాకర్ దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 6న పగిడిపల్లి–భువనగిరి రైలు మార్గంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం నిర్వహించిన కరుణాకర్ అంత్యక్రియలకు సైనికాధికారులు హాజరై గౌరవ సూచికంగా గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం జాతీయ పతాకాన్ని కరుణాకర్ తల్లి లక్ష్మికి అందజేశారు. కరుణాకర్ తండ్రి వెంకటేష్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తూ 28ఏళ్ల క్రితమే మృతిచెందాడు. అనంతరం కరుణాకర్ తల్లి లక్ష్మి స్వీపర్‌గా పనిచేస్తూ ఏకైక కుమారుడిని కష్టపడి చదివించింది. కరుణాకర్‌కు కొంత కాలం క్రితం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం ప్రతాపసింగారం గ్రామానికి చెందిన లతతో వివాహం అయ్యింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



కరుణాకర్ తల్లి లక్ష్మికి జాతీయ పతాకం అందజేస్తున్న ఆర్మీ అధికారి

చంపుతామని బెదిరించిన ఐదుగురి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్

సూర్యాపేటటౌన్ : పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని చంపుతామని బెదిరింపులకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం గ్రామానికి చెందిన బొర్ర సైదమ్మ తన ఇంటి ముందు నిలబడి ఉండగా.. అదే గ్రామానికి చెందిన గుండ్లపల్లి నవీన్, గుండ్లపల్లి సాయికుమార్, చందుపట్ల సందీప్‌కుమార్, బొర్ర అభిషేక్, పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెరుకుపల్లి అర్జున్ కారులో ఆమె వద్దకు వచ్చారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని నవీన్‌తో పాటు మిగతా వారు కారులో నుంచి తల్వార్ తిప్పుకుంటూ బయటకు దిగి సైదమ్మతో పాటు ఆమె కుమారుడు, మారపల్లి సతీష్, మోదాల నాగయ్యను బూతులు తిడుతూ చంపుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు సైదమ్మ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో తనను బెదిరించిన వారిపై ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి కారుతో పాటు తల్వార్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ బాలునాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాచారం కేసులో ఇద్దరికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): ఇంటర్ విద్యార్థినిపై హత్యాచారం కేసులో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం జీకే అన్నారం గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ(21) ప్రేమ పేరుతో ఇంటర్ చదువుతున్న విద్యార్థినితో పరిచయం పెంచుకున్నాడు. గత మూడు నెలలుగా ఇన్‌స్టాగ్రాం ద్వారా ఆమెతో చాటింగ్ చేశాడు. సదరు విద్యార్థిని మంగళవారం ఇంటి నుంచి కాలేజీకి బయల్దేరి నల్లగొండకు వచ్చింది. నల్లగొండ పట్టణంలోని డీఈఓ కార్యాలయం వద్ద వేచి చూస్తున్న విద్యార్థిని వద్దకు గడ్డం కృష్ణ బైక్‌పై వచ్చి ఆమెను తన స్నేహితుడైన నలగొండ మండలం రసూల్‌పుర గ్రామానికి చెందిన బచ్చలకూరి మధు(19) రూమ్‌కి తీసుకెళ్లాడు. కృష్ణ, ఆ విద్యార్థిని రూమ్‌లో ఉండగా.. మధు బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో కృష్ణ విద్యార్థినిపై అత్యాచారం చేశాడు. దీంతో బాలికకు తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందింది. వెంటనే కృష్ణ రూమ్‌కి తాళం వేసి అక్కడ నుంచి పారిపోయాడు. ఈ విషయాన్ని తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా కృష్ణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అదే రోజు సాయంత్రం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కృష్ణ లొంగిపోయాడు. కృష్ణ ఇచ్చిన సమాచారం ఆధారంగా అతడి స్నేహితుడు మధును కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి.. డాక్టర్లు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కృష్ణ, మధుపై పోలీసులు అత్యాచారం, హత్య, పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ విధించి కోర్టులో హాజరుపరిచారు. విలేకరుల సమావేశంలో టూటౌన్ సీఐ రాఘవరావు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు సైదులు, సైదాబాబు పాల్గొన్నారు.

అధిక వడ్డీ బాధితుడు మృతి



సరియా (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: అధిక వడ్డీ ఆశ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పలుగుతండాకు చెందిన రమావత్ సరియా(37) 20ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో కలిసి మిర్యాలగూడకు వలస వెళ్లాడు. ఈ క్రమంలో తాను సంపాదించిన డబ్బుతో పాటు తన బంధువుల వద్ద అప్పుగా తీసుకున్న సుమారు రూ.కోటి పలుగుతండాకు చెందిన బాలాజీకి అధిక వడ్డీకి అప్పు ఇచ్చాడు. ఇటీవలి కాలంలో బాలాజీ డబ్బులు ఇవ్వడంలేదని తెలుసుకున్న బంధువులు తమ డబ్బులు తమకు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో సరియా గత మూడు నెలలుగా బాలాజీ చుట్టూ తిరుగుతున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో బంధువుల వద్ద మాట పోతుందని మనస్తాపానికి గురై సోమవారం మిర్యాలగూడలోని తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ఆస్పత్రిలో తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సరియా మృతితో పలుగుతండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వడ్డీ వ్యాపారి సోదరి ఇంటి వద్ద బాధితుల ఆందోళన



బాలాజీనాయక్ సోదరి ఇంటి వద్ద బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

నేరేడుచర్ల : అధిక వడ్డీ ఆశ చూపి కోట్లాది రూపాయలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన రమావత్ బాలాజీనాయక్ సోదరి నేరేడుచర్లలో నివాసం ఉంటున్న విషయాన్ని తెలుసుకున్న బాధితులు బుధవారం ఆమె నివాసం వద్ద ఆందోళనకు దిగారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగుతండాకు చెందిన వడ్డీ వ్యాపారీ రమావత్ బాలాజీనాయక్ రూ.10 నుంచి రూ.16 వడ్డీ ఆశ చూపి కోట్లాది రూపాయలు వసూలు చేసి తిరిగి చెల్లించలేదు. ఆ నగదుతో తన సోదరి పేరుతో నేరేడుచర్లలో ఇల్లు కొనుగోలు చేశాడని తెలుసుకున్న బాధితులు ఆమె ఇంటిపై దాడికి యత్నించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఆస్తులను ధ్వంసం చేయడం సరైంది కాదని చెప్పి బాధితులను తిరిగి పంపించారు.

మానసిక ఆరోగ్యంగా ఉండాలి

బీబీనగర్: ప్రతిఒక్కరూ మానసిక ఆరోగ్యంగా ఉంటేనే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొవచ్చని బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. అలాగే స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం ముగియడంతో స్మారక వేడుకను నిర్వహించారు. మానసిక ఆరోగ్యంపై ఎంబీబీఎస్ విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ నితిన్ అశోక్ జాన్, మెడికల్ సూపరింటెండెంట్ మహేశ్వర్ లక్కిరెడ్డి, వైద్యులు సంగీత సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్రికా నత్తల నివారణ ఇలా..



పిట్టలగూడెంలో ఆఫ్రికా నత్తలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి, శాస్త్రవేత్తల బృందం



బీరకాయను తినేస్తున్న ఆఫ్రికా నత్త

- ఉద్యానవన అధికారులు, శాస్త్రవేత్తల సూచన

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో ఉద్యానవన అధికారుల, శాస్త్రవేత్తల బృందం బుధవారం ఉద్యానవన పంటలను పరిశీలించి తోటలకు హాని కల్గిస్తున్న నత్తలను ఆఫ్రికా నత్తలుగా గుర్తించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.సుబాషిణి, మల్లేపల్లి ఉద్యాన పరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త రాజాగౌడ్ ప్రాంతీయ ఉద్యానవనశాఖాధికారి కె.మురళితో కూడిన బృందం ఆఫ్రికా నత్తల ప్రభావాన్ని పరిశీలించి తగు నివారణ చర్యలను సూచించింది. ఆఫ్రికా నత్తలు వందేళ్ల క్రితమే భారతదేశానికి వలస వచ్చాయని, మూడేళ్లుగా తెలుగు రాష్ట్రాల తోపాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో విజృంభిస్తున్నాయని అన్నారు. కేరళ, తమిళనాడు , కర్ణాటక రాష్ట్రాల నుంచి శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను దిగుమతి చేసుకోవడం వల్ల ఈ ప్రాంతానికి ఆఫ్రికా నత్తలు వచ్చాయని గమనించామని తెలిపారు. ఆఫ్రికా నత్తలు జులై నుంచి ఫిబ్రవరి వరకు గుడ్లను ఒక్కో నత్త 400 గుడ్లు పెట్టి తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయని అన్నారు. ఒక్కో ఆఫ్రికా నత్త తమ జీవితకాలమైన ఐదేళ్లలో 1200 వరకు పిల్లలకు జన్మనిస్తుందని అన్నారు. బొప్పాయి, అరటి, జామ, ఆయిల్ పామ్ తదితర పండ్లతోటల తోపాటు కూరగాయల పంటలను నాశనం చేస్తాయన్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

ఆఫ్రికా నత్తల నివారణకు ఒక కిలో ఉప్పును నాలుగు లీటర్ల నీటిలో కలిపి ఆ నీటిలో గోనె సంచిని తడిపి గట్లపై వేస్తే ఈ నంచులపైకి వెళ్లిన నత్తలు ద్రావణం ఘాటుకు చనిపోతాయని తెలిపారు. ఆకర్షణ ఎర ఏర్పాటులో భాగంగా 10 కిలోల వరి తవుడుకు, ఒక కిలో బెల్లం , ఒక లీటరు ఆముదం మరియు ఒక కిలో థయోడికార్బ్ గుళికలు లేదా ఎసిఫేట్ లేదా క్లోరోపైరిఫాస్ కలిపి చిన్న ఉండలుగా చేసి ఈ ఉండలను బొప్పాయి, క్యాబేజీ ఆకుల కింద ఉంచితే ఆఫ్రికా నత్తలు తిని చనిపోతాయని శాస్త్రవేత్తలు చెప్పారు. అనంతరం వీటిని ఉప్పు ద్రావణంలో వేయాలని, వారానికి రెండు, మూడు రోజుల పాటు 15 రోజుల వరకు ఇలా చేయాలని సూచించారు. నత్తలు ఏరివేసే సమయంలో చేతికి గ్లౌజులు తప్పనిసరి ధరించాలన్నారు. 2 గ్రాముల కాపర్ సల్ఫేట్, 2 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి చెట్లపై పిచికారీ చేస్తే 70 శాతం నత్తలు కింత పడిపోతాయని, వీటిని ఏరి కాల్చి వేయలన్నారు. 2 గ్రాముల మెటల్డిహైడ్ 2.5 గుళికలు భూమి పైన మరియు చెట్ల మొదళ్లలో ఎరగా చల్లాలని అన్నారు. పండ్లతోటల్లో కలుపు, చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని , మొక్కలను ఒత్తుగా దగ్గరగా వేసుకోకూడదని, రాత్రిళ్లు నీరు పారించవద్దని చెప్పారు. తోటల్లో కోళ్లు, బాతులు పెంచుకోవాలని సూచించారు.

ఒకే రోజు గుండెపోటుతో ముగ్గురు నాయకులు మృతి

- కోదాడ నియోజకవర్గంలో విషాదం



భాగ్యరాజ్ (ఫైల్)



అంతయ్య (ఫైల్)



సురేష్‌బాబు(ఫైల్)

కోదాడ రూరల్ : కోదాడ నియోజకవర్గంలో ఒకే రోజు ముగ్గురు రాజకీయ నాయకుల గుండెపోటు మరణాలు ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. కోదాడ పట్టణానికి చెందిన యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆళ్ల భాగ్యరాజ్(34) మంగళవారం జ్వరం బారినపడి ట్యాబ్లెట్‌లు వేసుకున్నాడు. రాత్రి పడుకున్న తర్వాత బుధవారం తెల్లవారుజామున భార్య లేపగా ఎలాంటి కదలికలు లేకుండా ఉన్నాడు. వైద్యుడిని పిలిపించి చూడగా గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. అదేవిధంగా నడిగూడెం మండలం బృందావనపురానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మండవ అంతయ్య(81) బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో వేణుగోపాలపురం వెళ్లాడు. అక్కడ ఓ నాయకుడి ఇంటి వద్ద స్థానిక సంస్థల అభ్యర్థిత్వంపై చర్చిస్తుండగా ఒక్కసారి కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు, కోదాడకు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. చిలుకూరు మండల మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు దొడ్డా సురేష్‌బాబు(54) బుధవారం సాయంత్రం కోదాడ పట్టణానికి వచ్చి స్నేహితులతో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్నేహితులు సీపీఆర్ చేసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో మృతిచెందారు.